ప్రజాశక్తి
సోమవారం 13 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



బొర్రా గుహల వైభవం చాటిచెప్పేలా మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రాగుహల్లో మహాశివరాత్రి వేడుకలను రెండు రోజులపాటు నిర్వహించాలని అడ్వకేట్ సోమెల రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బొర్రా గుహలకు పర్యాటకుల రాకతో ఏటా కోట్లలో ఆదాయం వస్తున్నా, ఏపి ప్రభుత్వం, పర్యాటక శాఖ నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు కేవలం రూ.40వేలు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. బొర్రా గుహలకు వచ్చిన ఆదాయన్ని ఇతర అవసరాలకు మళ్లి, బొర్రా గుహల అభివృద్ధిని విస్మరించడం సరికాదన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను 17,18 తేదీల్లో బొర్రాగుహల చారిత్రక వైభవం ప్రపంచానికి ప్రస్ఫుటించేలా రెండు రోజులపాటు వైభవం నిర్వహించాలని, గిరిజనసంస్కృతిని చాటిచెప్పాలని కోరారు.

రెన్యువల్ చేసి ఆదుకోండి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి మాతృభాషా వాలంటీర్ల వినతి



వినతిపత్రం ఇస్తున్న మాతృభాషా వాలంటీర్లు

ప్రజాశక్తి పాడేరు/ పాడేరు టౌన్ : తమ సేవలను రెన్యువల్ చేసి వెంటనే విధుల్లో చేర్చుకొనేలా ఉత్తర్వులు ఇప్పించాలని గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల మాతృభాషా వాలంటీర్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి రాజన్న దొరను కోరారు. శనివారం సాలూరులోని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నివాసానికి వెళ్లిన ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి జిల్లాల, మాతభాష విద్యా వాలంటీర్లు ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందజేశారు. 2022 -23 విద్యాసంవత్సరంలో రెన్యువల్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. నవంబర్‌లో గిరి విజ్ఞాన సంబరాలకు పాడేరు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అప్పట్లో పాడేరు ఐటిడిఎలో వినయపూర్వకంగా కలిసి, మాకు రెన్యువల్ చేయాలని వినతి పత్రం ఇచ్చామని వారు మంత్రికి విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించి అల్లూరి సీతారామరాజు జిల్లా, కలెక్టర్ సుమిత్ కుమార్ , పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ సమాలోచన చేసి ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లా మాతభాష విద్యా వాలంటీర్లను మాత్రమే విధులకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చారని, కానీ రెన్యువల్ ఉత్తర్వులు నేటికీ ఇవ్వలేదన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకొని, అల్లూరితోపాటు ఇతర జిల్లాల్లోని భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాతభాష విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర సర్భునాయుడు, మర్రి చిట్టిబాబు, వంతల జోగేశ్వరరావు. శ్రీకాకుళం జిల్లా, విజయనగరం జిల్లా, మాతభాష విద్యా వాలంటీర్లు ఉన్నారు.

24 గంటల్లోనే కాఫీ సొమ్ము చెల్లింపు

- ఏజెన్సీలో 975 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- చిరుధాన్యాల సేకరణకు జిసిసి శ్రీకారం
- గిరిజన సహకార సంస్థ డిఎం కె.పార్వతమ్మ
- ప్రజాశక్తి ఇంటర్వ్యూలో వెల్లడి





ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలోని 10 మండలాలలో గిరిజన రైతులు అత్యధికంగా సాగు చేస్తున్న కాఫీని లక్ష్యానికి మించి కొనుగోలు చేయాలని జిసిసి లక్ష్యంగా నిర్ణయించినట్టు గిరిజన సహకార సంస్థ(జిసిసి) పాడేరు డివిజనల్ మేనేజర్ కె.పార్వతమ్మ వెల్లడించారు. ఈ ఏడాది 975 మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని, కాఫీని కొనుగోలు చేసిన 24గంటల్లోనూ సొమ్ములు చెల్లిస్తున్నామన్నారు. గిరిజన సహకార సంస్థ ద్వారా చేపడుతున్న అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, గిరిజనులకు అందిస్తున్న తోడ్పాటు తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. వివరాలు ఆమె మాటల్లోనే....

నేటి వరకు ఎంత కాఫీ కొనుగోలు చేశారు?
ఈ ఏడాది ఇప్పటివరకు 720 మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు చేసాం. మార్చి వరకు గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలు చేస్తాం. లక్ష్యానికి మించి కాఫీ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఏ రకం కాఫీకి ఎంత ధర చెల్లిస్తున్నారు?
పార్చ్‌మెంట్ రకం కాఫీ కిలోకు రూ.270 చొప్పున చెల్లిస్తున్నాము. చెర్రీ కాఫీ కిలో రూ.135 రూపాయలు ధర చొప్పున చెల్లిస్తున్నాం. కాఫీ సేకరించిన 24 గంటల వ్యవధిలోనే రైతులకు చెల్లింపులు పూర్తి చేస్తున్నాం.

జిసిసి కొనుగోళ్లపై రైతుల స్పందన ఏమిటి?
కాఫీకి ఈ ఏడాది జిసిసి అందిస్తున్న కొనుగోలు ధరపై రైతులు సంతృప్తిగా ఉన్నారు. వెంటనే చెల్లింపులు చేస్తుండడంతో రైతులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిసిసి కొనుగోలు ధర బాగుండడంతో జిసిసికి కాఫీని ఇవ్వడానికి గతంలో కంటే ఇప్పుడు రైతులు ఆసక్తి చూపడం మంచి పరిణామం.

గిరి రైతులకు జిసిసి అందిస్తున్న తోడ్పాటు ఏమిటి?
ఏజెన్సీలోని 10 మండలాల్లో కాఫీ ఉత్పత్తి చేస్తున్న గిరిజన రైతులకు జిసిసి ద్వారా సుమారు రూ.కోటి రుణాలు పంపిణీ జరిగింది. అలాగే కాఫీ సాగు చేయని కొయ్యూరు మండలంలో గిరి రైతులకు ఇతర వ్యవసాయ పంటల సాగుకు సుమారు రూ.65 లక్షల రుణాలు పంపిణీ చేసాం.

జిసిసి ద్వారా కొత్తగా చేస్తున్న కొనుగోలు ఏమిటి?
అల్లూరి జిల్లాలో గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ తోడ్పాటును ఇస్తున్నారు. ఈ ఏడాది మిరియాలు కొనుగోలు చేయాలన్న ఆలోచన ఉంది. అలాగే ఈ ఏడాది సామలు కొర్రలు రాగులు వంటి చిరుధాన్యాల కొనుగోలు కూడా చేపట్టాం. అలాగే పసుపుతో పాటు ఇతర అటవీ వ్యవసాయ ఉత్పత్తులు రాజ్మా చిక్కుళ్ళు కొండ చీపుర్లు శీకాయి, ఉసిరి, నల్ల జీడి పిక్కలు, నర మామిడి చెక్క తదితర వాటిని కొనుగోలు చేస్తున్నాం. మార్చి నుంచి చింతపండు కొనుగోలు చేయనున్నాం.

పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మాజీ సర్పంచ్ హత్య

ప్రజాశక్తి-చింతూరు
ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, దంతేవాడ జిల్లా, గీదం బ్లాక్ పరిధిలోని బార్సూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో హితమెట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామ్‌దార్ అలీమ్ (50)ను పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. రామ్‌దార్ అలీమ్ శనివారం వేరే గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మావోయిస్టులు కాపుగాచి కత్తులతో దాడి హత్య చేశారు. అనంతరం సంఘటనా స్థలంలో మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో లేఖను విడిచిపెట్టి వెళ్లారు. 2017 నుండి రామ్‌దార్ అలీమ్ పోలీసులకు సమాచారం అందజేస్తూ ఇన్‌ఫార్మర్‌గా కొనసాగుతున్నాడని ఆ లేఖలో మావోయిస్టులు ఆరోపించారు.

3 కిలోల ఐఇడి బాంబు నిర్వీర్యం

ప్రజాశక్తి-చింతూరు
బీజాపూర్ జిల్లాలోని ఆవపల్లి- ఉసూరు రహదారిలో మావోయిస్టులు అమర్చిన 3 కిలోల ఐఇడి బాంబును పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకొని నిర్వీర్యం చేశారు. ఈ రహదారి ప్రాంతానికి వచ్చే పోలీసులను టార్గెట్ చేసుకొని శివాలయం సమీపంలోని ప్రధాన రహదారికి 50 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో అమర్చిన ఈ బాంబును ముందస్తు సమాచారం మేరకు పోలీసులు, సిఆర్‌పిఎఫ్ 196 సీతాపూర్ క్యాంప్ బలగాలు దానిని గుర్తించి నిర్వీర్యం చేశారు. భద్రతా బలగాలను దెబ్బతీసేందుకు మావోయిస్టులు బలిగిని అమర్చారని అధికారులు తెలిపారు. భద్రతా బలగాలు, బీజాపూర్ బిడిఎస్ బృందం దాదాపు 2 గంటల పాటు వెతికి దానిని గుర్తించారు.



కంటి పరీక్షలకు క్యూకట్టిన గిరిజనులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి -సీలేరు
అల్లూరి జిల్లా, వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధి మంగంపాడులో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో ఉన్న 25 గ్రామాల గిరిజనులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. ఈ శిబిరంలో గుండె, చర్మ వ్యాధి, స్త్రీ వ్యాధి, కంటి, దంత వ్యాధి నిపుణులు, కేరళ వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందించారు. వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 302 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 15 మందికి కంటి ఆపరేషన్ చేయవలసిందని కంటి వైద్య నిపుణులు నిర్ధారించారు. వీరిని కంటి ఆపరేషన్ నిమిత్తం రాజమండ్రి తరలించారు. మరో 150 మందికి కంటి అద్దాలు అవసరమని వైద్య నిపుణులు సూచించారు. రాజమండ్రికి చెందిన ప్రముఖ జనరల్ ఫిజీషియన్ గోలి రామారావు పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. శిబిరానికి హాజరైన గిరిజనులకు సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలను ఏర్పాటు చేశారు. గిరిజన వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. జనరల్ వైద్య నిపుణులు జి. వెంకటరమణ, కె.ప్రభాకర్, కంటి వైద్య నిపుణులు శ్రీకాంత్ రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు కిరణ్, జనరల్ సర్జన్ సునీల్, మరికొంతమంది వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, డొంక రాయి ఎంపిటిసి కరక రమణ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు మన్యం ముస్తాబు

16 నుంచి 19 వరకు జాతర మహోత్సవాలు
ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
సన్నాహాల్లో నిమగ్నమైన శివ క్షేత్రాల ఉత్సవ కమిటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకొని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి మొదలైంది. జాతర నిర్వహణకు శివాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. పాడేరు ఏజెన్సీలోని అనేక ప్రాంతాల్లో గిరిజనులు ఆదిదేవుడికి ఆనవాయితీగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీలోని చింతపల్లి, జికే వీధి, జి.మాడుగుల, పెదబయలు పాడేరు, హుకుంపేట తదితర మండలాలతోపాటు అనంతగిరి మండలంలోని బొర్రా గుహల్లో ఈ నెల 16 నుంచి 19 వరకు మహాశివరాత్రి జాతర మహోత్సవాలు నిర్వహించడానికి భక్తులు సన్నాహాలు చేస్తున్నారు

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు పట్టణంలోని ఉమా నీలకంటేశ్వర స్వామి, మోదకొండమ్మ ఆలయాల్లో ఈనెల 16,17,18 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,డాక్టర్ తమర్భ నరసింగరావు దంపతులతోపాటు ఆలయ ప్రధాన అర్చకులు రామంవంతులు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, కొట్టగుల్లి సుబ్బారావు ఆదివారం ఆలయం వద్ద ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. పాడేరు ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద నూతనంగా రూపొందించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి.అయ్యప్ప స్వామి విగ్రహాల ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగ పూజారి శివకుమార్ మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య దొర. ఆధ్యాత్మిక సేవా బృందం సభ్యులు ఉప్పల వెంకటరత్నం శివరాత్రి శ్రీనివాస్ కొత్తగుల్లి రామారావు రమేష్ నాయుడు పలసీ బాలన్న, కొట్టగుల్లి పోతురాజు ,కొండాజీ, చిట్టినాయుడు, తమర్భకొండబాబు, బోనంగి వెంకటరమణ, పాలసీ బాబురావు , రవి, సాయి ,వర్తన పద్మ, కిముడు వెంకటరత్నం రామానాయుడు, మహిళలు ఆధ్యాత్మిక సేవాబృందం సభ్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఉత్సవాలకు వేలాది మంది భక్తులు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

మత్స్య గుండంలోనూ విస్తృత ఏర్పాట్లు

మన్యంలో ప్రసిద్ధిగాంచిన ప్రాచీన శైవ క్షేత్రం మత్స్యగుండం మత్స్య లింగేశ్వరస్వామికి ఏటా ఆనవాయితీగ మూడురోజుల పాటు నిర్వమించే మహాశివరాత్రి వేడుకలను ఈనెల 17 నుంచి 19 వరకు ఉత్సవాల నిర్వహణకు విస్తతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ పర్యవేక్షణలో దేవాదాయ ధర్మాదాయ శాఖఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి. మత్స్యగుండంలోని మత్స్య లింగేశ్వరస్వామి మహిమాన్వితుడని స్థానికుల విశ్వాసం. శివరాత్రి రోజున జాతరలో పాల్గొని, రాత్రంతా జాగరణ చేసి మరుసటి రోజు ఉదయం మత్స్య గుండంలో భక్తులు పుణ్యస్నానాలను ఆచరిస్తారు. చింతపల్లి మండలం అంతర్ల లో ఐదు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో సుమారు 500మంది విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలున నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్, సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ ఆదేశాలతో నిర్వహించిన వైద్యశిబిరంలో సాధారణ వ్యాధులకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణకు పరీక్షలు చేశారు. గాయత్రి విద్యాసంస్థ డైరెక్టర్ శర్మ, ప్రిన్సిపల్ రజిని, ఎంఇఒ ఎస్ రామచంద్రరావు, శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ, సిహెచ్ బాలమణి దేవి, విద్యాశాఖ కోఆర్డినేటర్ వి.జయరాజు, ఎన్‌ఆర్‌ఐ, బృందం తదితరులు పాల్గొన్నారు

మాజీ ఎంపిటిసి గంగులు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని మారుమూల పిన్నకోట పంచాయతీ కొర్రాపర్తి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపిటిసి సభ్యుడు పంది. గంగులు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగులు, ఆదివారం స్వగ్రామం కొర్రాపర్తిలో మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ చిరంజీవి, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దలు పెద్దఎత్తున అంతి మ సంస్కారాల్లో పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

మన్యంలో కొనసాగుతున్న చలి తీవ్రత



పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతోపాటు ఏజెన్సీలో పొగ మంచు తీవ్రత తగ్గడం లేదు. ఆదివారపాడేరుతో పాటు పరిసరాల ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగానే కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 వరకు పొగ మంచు దట్టంగా కమ్మేసింది. ఎదురుగా ఉన్న వ్యక్తుల సైతం కనిపించని విధంగా వాతావరణం ఏర్పడింది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. చలి ప్రభావం తీవ్రంగా ఉంటుండడంతో జనం వణుకుతున్నారు. కొన్ని రోజులుగాఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గడంతో ఏజెన్సీ వాసులు ఉన్న దుస్తులు ధరిస్తూ, చలి మంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

మిర్చి రైతులకు అధికారులు సహకరించాలి

సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ



మిర్చి తోటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-విఆర్.పురం
మిర్చి రైతులకు అధికారులు సహకరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటలను సిపిఎం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2022 వరదలు కారణంగా మిర్చి పంటలు ఆలస్యంగా సాగు చేశారన్నారు. పంటను పశువులు నాశనం చేయకుండా జాగ్రత్తగా చూసుకోవాలని, లేకుంటే నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. పంట ఆలస్యం కావడంతో ఈ ఏడాది తెగుళ్ల విపరీతంగా రావడంతో పెట్టుబడి కూడా పెరిగిందని తెలిపారు. సుమారు ఎకరాకు రెండు లక్షల, నుండి మూడు లక్షల రూపాయల వరకు రైతులు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో అధికారులు రైతులకు సరైన సూచనలు చేసి, గిట్టుబాటు ధర వచ్చే విధంగా సహకరించాలని కోరారు. లేకుంటే నష్టాలు చవిచూసి రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సి దుస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రైతు సంఘం మండల కార్యదర్శి వడ్లది రమేష్, పంకు సత్తిబాబు, నాళ్లారపు ప్రకాష్, రైతులు కడుపు రాము, తెలగాని వెంకన్న, బుర్ర శ్రీను, సత్యనారాయణ, అప్పారావు పాల్గొన్నారు.

కన్నాపురం గ్రామ సమస్యలు పరిష్కరించాలి



రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఎటపాక
మండలంలోని కన్నాపురం గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా కన్నాపురం గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. కన్నాపురం మాధవరావు పేట గ్రామాల మధ్య రోడ్డు గోతులతో ప్రమాదాలకు నిలయంగా ఉందని తెలిపారు. వ్యవసాయ భూములకు వెళ్ళడానికి గాని ఇదొక్కటే మార్గమని, వర్షా కాలంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా ఉందని, మాధవరావు పేట గ్రామం వరకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. గతేడాది మే నెలలో ఇరపా వెంకన్న ఇల్లు కాలిందని, అధికారులు రాసుకొని వెళ్ళారుగాని ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పై సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆ ప్రజలను తీసుకు వచ్చి లక్ష్మీపురం సచివాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఆకిశెట్టి రాము, సవలం రాము, నక్కా సూరిబాబు, పూనెం వెంకట్రావు, సవలం చంద్రయ్య, ఇరపా చంద్రయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కనకదుర్గ అమ్మవారి సంబరాలు

ప్రజాశక్తి-చింతూరు
మండల కేంద్రంలోని శబరి నది ఒడ్డున వెలసిన కనకదుర్గ అమ్మవారి సంబరాలు ఆదివారం మూడో రోజు విజయవంతంగా ముగిశాయి. వేకువ జామునే భక్తులు శబరి నది జలాలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కానుకగా స్థానిక వ్యాపారి కొల్లూరి రామారావు దంపతులు వెండి గిన్నెను బహుకరించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ఉమామహేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3000 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు నరేడ్ల సత్తిబాబు, నీలాపు నరసింహరావు, శేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు పడకపోతే బతికేది ఎలా?

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆదివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటుందని, దీనిని గిరిజన సంఘంగా తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు చాలామందికి నేటికీ జీతాలు పడలేదన్నారు. ఉద్యోగులు తమ జీతాలపై నెలవారీ ఈఎంఐలు, రుణాలకు సంబంధించిన వాయిదాలు ఏర్పాటు చేసుకుంటారని తెలిపారు. అటువంటి వారికి సకాలంలో జీతాలు పడకపోవడం వలన వాయిదాలు పెండింగ్ అవడంతో పాటు వాటికి అదనంగా అపరాధ రుసుములు చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉద్యోగస్తులకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సోకుల గూడెంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం
మండలంలోని సోకుల గూడెం గ్రామంలో మంచి నీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోకుల గూడెంలో తాగునీటి వనరులను, పైపులైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బోరుతో పూర్తి స్థాయిలో అందరికీ నీళ్లు అందటం లేదని, ఉన్న మోటార్ కొద్దిసేపు వచ్చి ఆగిపోతుందని తెలిపారు. నీళ్ల ట్యాంక్ ఉన్న ఉపయోగం లేదన్నారు. అందువల్ల శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం స్థానికులు కాలువ నీళు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సోకుల గూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని పూర్తిగా మరమ్మతులకు గురైందని, దానిని బాగుచేయాలని, బ్రిడ్జిని నిర్మిచాలని, గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడబాల రామారావు, లింగమ్మ, గంగ భవాని, నర్రి శివాజీ, కడబాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు



ఊటగెడ్డలో నీటిని సేకరిస్తున్న గిరిజనులతో గిరిజన సంఘం నేత విద్యాసాగర్‌రెడ్డి

రూ.25లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - అనంతగిరి : బొర్రా పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రూ 25 లక్షలతో సిసి రోడ్లు తాగునీటి పనులు చేపట్టామని సర్పంచ్ జన్ని.అప్పారావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బొర్రా గుహలు ఆదాయంలో వచ్చే 25శాతం నిధులతో గంగా కోయిట్‌గుడ, కటికి, జీలగెడ్డ, డేకపురం గ్రామాలకు వీధి రోడ్లు, మరికొన్ని గ్రామాలకు తాగునీటి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. బొర్రా గుహలకు వచ్చే నిధులతో పంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్‌కు విన్నవించగా, కలెక్టర్ ఆదేశాలతో పర్యాటకశాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. శివరాత్రి ఉత్సవాలకు సరిపడా నిధులను కూడా చెల్లిస్తామని ఎపి పర్యాటకశాఖ హామీనిచ్చిందన్నారు.

మంచినీటి బావికి మరమ్మతులు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో నేటికీ తాగునీటికి వినియోగంలో ఉన్న 120ఏళ్లనాటి బావికి మరమ్మతులు చేపట్టినట్లు సరపంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు తెలిపారు. మంచినీటి బావికి గచ్చు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని తొలగించి, తిరిగి బావి చుట్టూ నూతనంగా గచ్చు, గట్టు, కాలువలకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పురాతనమైనప్పటికీ, నేటికీ ఇదే బావి నీటిని స్థానికులు వినియోగిస్తున్నారు. ఈ బావి నీరు పరిశుభ్రంగా, రుచికరంగా ఉండడమే దీనికి కారణమంటున్నారు. పండగలు, పలు శుభకార్యాలు జరిగినప్పుడు పూర్వీకులు నుంచి ఆనవాయితీగా ఈ బావి నీటిని తీసుకెళతారు. గ్రామంలో చేతిపంపు బోర్లు, రక్షిత మంచినీటి పథకం కుళాయిలు ఉన్నప్పటికీ నేటికీ దాదాపు రెండు వేల జనాభా ఉన్న కవగుంట గ్రామస్తులు ఈ బావి నీటినే తాగేందుకు ఆసక్తి చూపుతుంటారని, అందుకే ఏటా ఈ బావిలోని పాత నీటిని, కింద పేరుకుపోయిన మట్టిని తొలగించి శుభ్రపరుస్తామన్నారు. వేసవిలో సైతం సమృద్ధిగా నీరుండడం, ప్రజలంతా ఈ నీటిని వాడేందుకు ఆసక్తి చూపడం వంటి కారణాలతో దీన్ని బాగుచేసినట్లు తెలిపారు. బావిలోని పూడిక తొలగింపుతోపాటు, బావిని పటిష్టపరిచినట్లు తెలిపారు.

బుచ్చింపేటకు నాలుగు బోర్లు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తన నిధుల నుంచి బుచ్చింపేట గ్రామానికి నాలుగు చేతి పంపులు మంజూరు చేశారు. గత వారం బుచ్చింపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ దృష్టికి స్థానికులు తాగునీటి సమస్యను తీసుకురాగా, వెంటనే స్పందించి నాలుగు బోర్లు మంజూరు చేశారని సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపిటిసి సత్యవతి, రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

విజయ్ సాయిరెడ్డిని కలిసిన చెంగల

ప్రజాశక్తి -పాయకరావుపేట : మాజీ ఎమ్మెల్యే వైసిపి నేత చెంగల వెంకటరావు ఆదివారం వైసిపి ముఖ్యనేత, నాయకులు ఎంపీ విజయసాయిరెడ్డి కలిసారు విశాఖ వచ్చిన విజయసాయిరెడ్డిని చెంగల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు ఇటీవల కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు నియోజవర్గంలో విస్తత పర్యటనలు చేస్తున్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అక్కడికి వెళ్లి వారిని పరామర్శిస్తున్నారు ఈ నేపథ్యంలో విజయ సాయిరెడ్డిని కలవడం నియోజవర్గంలో చర్చనీయాంశమైంది పలువురు పెద్దల ఆశీస్సులతో పార్టీ టికెట్ కోసం చెంగల ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది

అరటి తోట నరికివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి మాకవరపాలెం: అరటితోట నరికివేతపై పోలీసులకు పిర్యాదు చేశామని రెడ్డిలక్ష్మి, రెడ్డి నాయడమ్మ అన్నారు. మాకవరపాలెం మండలం వెంకన్నపాలెంలో తమ సాగులో ఉన్న అరటి తోటలను రమణ శ్రీను, రెడ్డి ఆక్కునాయుడు రెడ్డి అబద్దం అనే నలుగురు వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి పూర్తిగా నరికేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఈ వక్తులు మామిడి తోటను పూర్తిగా నరికివేయడంతో అప్పట్లోనూ అనకాపల్లి ఎస్‌పికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి వదలేయడంతో మళ్లీ దౌర్జన్యానికి తెగబడ్డారని బాధితులు లబోదిబోమంటున్నారు. బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని కొనవానిపాలం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న ఆదేశాలతో ఎం.టి.రామ గోవింద్ సూచనలతో కొనవానిపాలెం మహిళారైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులకు మహిళ సంఘాలు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగు, పిఎమ్‌డిఎస్ గురించి రైతులకు వివరించారు. కొనావాని పాలెం గ్రామం లో మహిళ సంఘాల సభ్యులు. రైతులతో 'నవధాన్యాలు సాగు - నేలతల్లికి బాగు' అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ప్రకృతి వ్యవసాయం లాభాలు, నవధాన్యాల సాగుతో ప్రయోజనాలను వివరించారు.

అదనపు పైపులైన్‌తో మరణమే శరణ్యం

మెడకు ఉరి తాళ్లు వేసుకుని మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ రెండవ పైపులైను ఏర్పాటు చేస్తే తమకు మరణమే శరణ్యమని మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు .పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహాధర్నా ఆదివారం 437వ రోజుకు చేరింది. శిబిరం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మత్స్యకారులతో కలిసి మెడకు ఉరితాళ్ళు బిగించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇప్పటికే కంపెనీ నుంచి వెలువడే రసాయనాల వలన తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవటం వలన ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నామని, మరలా రెండో పైపులైను వేస్తే గ్రామాలకు గ్రామాలు పూర్తిగా ఖాళీ చేసి వెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు, పైపులైను వేయవద్దని, అదనపు పైపులైనుకు అనుమతులు ఇవ్వవద్దని మత్స్యకారులు 14నెలలుగా నిరాటంకంగా పోరాడుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. మత్స్యకారులను మోసం చేస్తూ పైపు లైన్‌కు అనుమతులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని కంపెనీ యాజమాన్యానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్ బాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు,గోసల సోమేశ్వరరావు,పిక్కిరమణ,కోడా కాశీ రావు,కారే రాజారావు,కారే కోదండరావు, చొక్కా గోపి,మైలపల్లి బాపూజీ, వాసుపల్లి దేముడు, మైలపల్లినల్లోడు, వాసుపల్లిశ్రీను, అర్జిల్లి కాశీ, మైలపల్లి దాద్రాజు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు వెనక్కి...

విశాఖకు తరలించిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్ర మిషన్లు
అనకాపల్లి డిఆర్‌డిఎ అధికారుల చొరవతో యథాస్థానానికి
వినియోగంలోకి తేవాలని పలువురి వినతి

ప్రజాశక్తి -కోటవురట్ల : విశాఖపట్నం తరలించుకుపోయిన ఫ్యాషన్ టెక్నాలజీ కుట్టుమిషన్లను అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అధికారుల చొరవతో మళ్లీ వెనక్కు రప్పించారు. 2005-06లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణకు కోట్లు వెచ్చించి కుట్టు మిషన్లు ఇటీవల విశాఖ జిల్లాకు డిఆర్‌డిఎ అధికారులు తరలించుకుపోయారు. దీనిపై అనకాపల్లి జిల్లా డిఆర్‌డిఎ అధికారులు వెంటనే స్పందించి తీసుకువెళ్లిన మిషన్లు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు, మండల వెలుగు ఎపిఎం రమణకుమారి కుట్టుమిషన్లు తీసుకువెళ్తున్న సమయంలోనే వద్దని వారించినా వినకపోవడంతో జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అనకాపల్లి జిల్లాకు చెందిన ఆస్తులు విశాఖ జిల్లాకు ఎలా తీసుకువెళ్తారని జిల్లా అధికారులు స్పందించడంతో ఆదివారం వాటిని యథాస్థానంలో తెచ్చి ఉంచారు రాజశేఖరరెడ్డి హయాంలో ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ, ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రం పనితీరు ఆరంభశూరత్వంగానే మిగిలిపోవడంతో మహిళలకు ఎటువంటి శిక్షణ, ఉపాధి కల్పించలేకపోయారు. ఖరీదైన మిషన్లు, ఆధునిక సౌకర్యాలు కల్పించినప్పటికీ, వినియోగంలో సంబంధిత అధికారుల వైఫల్యం వల్ల మిషన్లన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. ప్రస్తుతం మండలానికి చెందిన పలువురు మహిళలు అచ్యుతాపురం బ్రాండిక్స్ వంటి కంపెనీలకు ఉపాధికి వెళుతున్న నేపథ్యంలో ఈ కేంద్రం సక్రమంగా ఉపయోగపడి ఉంటే వారే శిక్షణ పొంది స్వయంఉపాధి పొందేవారని అంటున్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత అయినా అధికారులు స్పందించి ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తారని భావించినా, మిషన్ల తరలింపు ద్వారా ఏకంగా మూసేసే చర్యలు చేపట్టడం దారుణమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

మహా శివరాత్రి జాతరకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 18,19 తేదీల్లో జరగబోవు కల్యాణపులోవ ధారమట్టం జాతర్ల సందర్భంగా వివిధ గ్రామాలకు ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలతో నర్సీపట్నం ఆర్‌టిసి డిపో నుండి 50 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా బస్‌ల కండిషన్‌ను చెక్ చేసి సరిచేసి ప్రయాణికులు, భక్తులకు అసౌకర్యం కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు, చేరవేసేందుకు వీలుగా బస్సుల సామర్థ్యం పరిశీలనకు విశాఖపట్నం జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బి. అప్పలనాయుడు వచ్చారు. అన్ని బస్సులను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరిచేయుటకు అధికారులకు, గ్యారేజ్ సిబ్బందికి తగు సూచనలు చేశారన్నారు. బస్సులకు అవసరమయ్యే స్పేర్ పార్ట్స్ ముందుగా సిద్ధం చేసుకోమని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో మెకానిక్ ఫోర్‌మేన్ ఆచారి సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి-రోలుగుంట : ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో కోడ్ అమల్లోకి వచ్చిందని రోలుగుంట ఎంపిడిఒ కె.ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులకు ఆదేశించామన్నారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

నేరాలు ఘోరాలు



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

202 కిలోల గంజాయి స్వాధీనం


ముగ్గురు అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
నిందితుల్లో ఒకరు ఆర్‌పిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అక్రమంగా తరలిస్తున్న 202 కిలోల గంజాయిని పోలీసులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్ఐ ఆర్ సంతోష్‌కుమార్ ఆదివారం చెప్పిన వివరాలివి.

ఒడిశా పాడువ ప్రాంతం నుండి విశాఖపట్నం మీదుగా ఉత్తరప్రదేశ్‌కు రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అరకులోయ మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ గ్రౌండ్ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఎస్ఐ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా, రెండు కార్లలో 202 కిలోల గంజాయి గుర్తించారు. కారుల్లోని నిందితులు పరారీకి యత్నించగా ముగ్గురిని పట్టుకున్నామని, మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో ప్రాంతానికి చెందిన నరేంద్రకుమార్ అనే ఆర్‌పిఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన రాహుల్ సింగ్, పాడువ ప్రాంతానికి చెందిన కైసబ్ అనంత్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. రెండు కార్లు సీజ్ చేశామని తెలిపారు. పరారైన ముగ్గురు నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి -కంచరపాలెం: జ్ఞానాపురం బిఆర్‌టిఎస్ రోడ్డులో విషాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మురళీనగర్ బర్మాకాలనీలో నివాసముంటున్న దినేష్ కుమార్ (27) సిపోర్టు వద్ద ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకొని సుజుకి యాక్సెస్ వాహనంపై సిపోర్ట్ నుంచి కాన్వెంట్ మీదుగా కంచరపాలెం వైపు ఇంటికి బయలుదేరాడు. ఈ తరుణంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి (27), పి.సాయిసాగర్ కలిసి సింహాచలం నుంచి కంచరపాలెం, కాన్వెంట్ జంక్షన్ మీదుగా ఆర్‌కె.బీచ్‌కు డ్యూక్ బైక్‌పై వేగంగా వెళుతున్నారు. జ్ఞానాపురం జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీ ఎదురుగా బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద కంచరపాలెం వైపు వెళ్తున్న దినేష్‌కుమార్ వాహనాన్ని, డ్యూక్ బైక్‌తో రామిరెడ్డి ఢీ కొట్టాడు. రెండు వాహనాలూ కిందపడిపోయాయి. ఈ ఘటనలో దినేష్‌కుమార్, రామిరెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రామిరెడ్డి వెనుక కూర్చున్న సాయిసాగర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పశ్చిమ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం సిఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దినేష్‌కుమార్, రామిరెడ్డి మృతదేహాలను కెజిహెచ్ మార్చురీకి తరలించారు. సాయిసాగర్‌ను చికిత్స నిమిత్తం కెజిహెచ్‌లో చేర్చారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అంటున్నారు. హెల్మెట్లు ధరించి ఉంటే ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉండేదని అభిప్రాయపడుతున్నారు. సిఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కనువిందు చేస్తున్న సూర్యాస్తమయం

సూర్యాస్తమయం.. కనువిందు

ప్రజాశక్తి-సీలేరు : సీలేరులో ఆదివారం సూర్య అస్తమయం సమయంలో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. కొంతవాడ రిజర్వాయర్ సమీపంలో ఈ దృశ్యం చూపురలను కట్టిపడేసింది. గుంటవాడ రిజర్వాయర్ సమీప అటవీ ప్రాంతం సీలేరు రిజర్వాయర్‌లో నదీ జలాలు ఆకాశంలో మబ్బులతో కూడిన వాతావరణం నడుమ లేత కాషాయ రంగులో అపురూప దృశ్యం ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో దర్శనమిచ్చింది. రిజర్వాయర్ పైనుంచి ఆంధ్ర ఒడిశా సరిహద్దుకు ప్రయాణిస్తున్న వాహన చోదకులు, వారపు సంతకి వచ్చే పోయే గిరిజనుల సైతం దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

ముత్యాల శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సభ

ప్రజాశక్తి-విఆర్.పురం : టిడిపి మండల మాజీ కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సభ ఆదివారం విఆర్.పురంలోని ఆయన నివాసంలో జరిగింది. శ్రీనివాస్ చిత్ర పటానికి మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, జెడ్పీటీసీ రంగారెడ్డి, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు, బొర్రా నరేష్ కుమార్, సవలం రాజేంద్రప్రసాద్, బీరక సూర్య ప్రకాష్‌రావు, ముత్యాల సిద్దు, గొంది చంద్రయ్య, జంగాల మల్లికార్జునరావు, బొర్రా నరసింహారావు, ముత్యాల రమేష్, ముత్యాల చంద్రశేఖర్, కారం సిరమయ్య, బురక సారయ్య, కోట్ల వాసు, హరిబాబు, రవి మిత్రులు బండి రామకృష్ణ, బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.



సంచార వైద్యశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

200 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం

రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. రక్తపరీక్షలు 180 మందికి, థైరాయిడ్ పరీక్షలు ఎనిమిది మందికి, ఫీజియో థెరపీ ఏనిమిది మందికి, ఎక్స్-రే లు ఎనిమిది మందికి, ఈసిజీ ఒక్కరికీ చేసినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో తలారి వెంకట సుబ్బారావు, జి.భాస్కర్, రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్, ఎన్.దుర్గాప్రసాద్, రామిరెడ్డి శ్వేత, కానుమొను శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు అన్న వితరణ చేశారు.

వారపు సంతకు పుచ్చకాయలు

ప్రజాశక్తి - సీలేరు

ఒడిశా వాసులు పండించిన పుచ్చకాయలను సీలేరు వారపు ఆదివారం తీసుకొచ్చారు. వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎగబడ్డారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దులోని మల్కనగిరి జిల్లా సోమనాథ్ పూర్ పంచాయతీ, అప్పన్న మల 36 గ్రామానికి చెందిన బత్తు కృష్ణ పుచ్చకాయలు విక్రయించేందుకు సీలేరు వారపు సంతకి తీసుకొచ్చారు. కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రీమేపి పెరిగిన నేపథ్యంలో వేడి నుంచి ఉపశమనం పొందడానికి పుచ్చకాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి కనపరిచారు.



జోరుగా సాగుతున్న పుచ్చకాయల వ్యాపారం

విరివిగా పండుతున్న పుచ్చకాయలు

సోమనాథ్ పూర్ పంచాయతీ పరిధిలో సుమారు 100 మంది రైతులు పుచ్చకాయ పంటలు వేసి అధిక దిగుబడులు పొందుతున్నారు. ఈ సందర్భంగా రైతు బత్తు కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఏడాది సుమారు 20 నుంచి 50 ఎకరాల్లో 100 మంది రైతులు పుచ్చకాయల పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక భూములు ఈ పంటలకు అనుకూలంగా ఉంటాయని, మూడు నెలల వ్యవధిలో పంట చేతికొస్తుందని చెప్పారు. భువనేశ్వర్ కోల్‌కతా, జైపూర్, జగదల్‌పూర్ ప్రాంతాలకు పుచ్చకాయలను ఎగుమతులు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ఏడాది పుచ్చకాయలు పంటలు మంచి ఫలితాలు ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఉక్కు' పరిరక్షణ దీక్షల్లో వికలాంగులు



దీక్షా శిబిరంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, వికలాంగులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని, ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలని చూస్తే సహించేది లేదని వికలాంగులు నినదించారు. అమ్మేవాడిని, కొనేవాడిని ప్లాంట్ దరిదాపుల్లోకి రానిచ్చేది లేదని హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారానికి 682వ రోజుకు చేరాయి. దీక్షల్లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం వల్ల రిజర్వేషన్లకు విఘాతం ఏర్పడుతుందన్నారు. వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టిలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ ఎంతో కీలకపాత్ర పోషించిందన్నారు. అటువంటి కర్మాగారానికి సొంత గనులు కేటాయించాల్సింది పోయి ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు పన్నడం దారుణమన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు వికలాంగులను అస్సలు పట్టించుకోవన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరవాడ ఫార్మా సిటీ, అచ్యుతాపురం సెజ్, దువ్వాడ విసెజ్‌ల్లో ఒక్క వికలాంగ ఉద్యోగీ లేరన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే వికలాంగులకు ఆదరువుగా ఉన్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య, నాయకులు బడే అప్పలరాజు, సత్తిబాబు, బి.శ్రీనివాస్, మల్లేశ్వరరావు, పి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఎంజిసిహెచ్‌లో బాల్య కేన్సర్ దినోత్సవం


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ (ఎంజిసిహెచ్)లో ఆదివారం అంతర్జాతీయ బాల్య కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్య కేన్సర్‌పై అవగాహన, పిల్లల సంరక్షణ, వారి కుటుంబ సభ్యులకు సహకారం వంటి అంశాలపై ప్రచార నిమిత్తం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బాల్య దశలో వచ్చే కేన్సర్ కేవలం పిల్లలను, వారి కుటుంబాలను మాత్రమే కాకుండా సమాజాన్ని ప్రభావితం చేస్తుందని తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చింతూరు : మండల కేంద్రంలోని శబరి బ్రిడ్జి దిగు భాగాన ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కూనవరం మండలం భజరాయగూడ గ్రామానికి చెందిన చోడి శ్రీరాములు, కుంట గ్రామానికి చెందిన బాబురావు ద్విచక్ర వాహనాలపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో ఇరువురి తరాలకు తీవ్ర గాయాలైనాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బైక్లు ప్రమాదం జరిగిన ఘటన ప్రాంతాన్ని స్థానిక పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

విరగ్గాసిన అంజూర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలం చిన్న రెల్లంగిపాడు గ్రామంలో పాసెం శేషగిరి అనే రైతు తన వ్యవసాయ క్షేత్రంలో నాటిన అంజూర చెట్టుకు పళ్ళు గుత్తులు గుత్తులుగా విరగ్గాసాయి. ఇవి చూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. శేషగిరి నాలుగేళ్ల క్రితం నాటిన మొక్క పెరిగి నేడు వందల కొలది కాయలతో కళకళ లాడుతోంది. చల్లటి వాతావరణంలో ఎప్పుడూ నీరు ఉండడంతో ఈ మొక్క ఏపుగా పెరిగింది. అంజూరం పండ్లు చాలా రుచిగా ఉండడంతోపాటు ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని రైతు తెలిపారు. వీటిని ఎండబెట్టుకుని కూడా తినవచ్చని చెప్పారు. ఐరన్‌తో పాటు పలు పోషకాలు కలిగిన ఈ పండును చూసిన వారు తినకుండా ఉండలేరు. ఈ పళ్ళు రోజుకు నాలుగు చొప్పున తీసుకుంటే బరువు తగ్గడానికి దోహదపడుతుందని గ్రామస్తులు తెలిపారు, ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండానే కాయలు కాశాయని రైతు చెప్పారు.



గుత్తులుగా అంజూర పండ్లు

శివాలయంలో ఎంపీ దంపతుల పూజలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ దాత పిండం సత్యనారాయణ, వైసిపి నాయకులు గొడ్డేటి మహేష్ బాబు, సర్పంచ్ రాజబాబు, ఎంపిటిసి రత్నం, మాజీ సర్పంచులు పొడుగు సూరిబాబు, రామ్మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యారంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేసే ప్రజా వ్యతిరేకమైన నూతన జాతీయ విద్యా విధానం - 2020ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యా హక్కు వేదిక ఇచ్చిన పిలుపు మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ తరగతుల పిల్లలు పూర్తిగా విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. ఆ విద్యా విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఇప్పటికే జిఒ నెంబర్ 84, 85, 117 తీసుకొచ్చి పాఠశాలలను మెర్జ్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా 2600 పైచిలుకు పాఠశాలలను మూసివేశారన్నారు. బైజూస్ ఒప్పందాన్ని రద్దు చేసి ఉపాధ్యాయులతోనే పాఠ్యాంశాలు బోధించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50,600 టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ధర్మేందర్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ పాఠశాలలను ముక్కలు చేస్తోందని విమర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ మూడున్నర సంవత్సరాల కాలంలో ఒక టీచర్ పోస్ట్ కూడా భర్తీ కాలేదన్నారు. డిటిఎఫ్ జిల్లా నాయకులు బుజ్జి మేడం, ఎల్.సత్యనారాయణ, నానాజీరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనుంజయ్, కిషోర్, రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు శరత్, న్యాయవాది చలం, కెవిఎస్.రాజు పాల్గొన్నారు.